ఖోఖో.. కాస్కో

పోటీ ఏదైనా పతకం రావాల్సిందే.. మైదానంలో దిగితే మోతమోగాల్సిందే.. ప్రత్యర్థి జట్టు ఎంత బలమైనదైనా వీరి నైపుణ్యం ముందు తగ్గాల్సిందే.. అంతలా ఖోఖో క్రీడలో రాణిస్తున్న అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్‌కు మైదానం లేకపోవడం శాపంగా మారింది.



ఖోఖో పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు (ఫైల్)

జాతీయ స్థాయిలో రాణిస్తున్న అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థులు

- పోటీ ఏదైనా పతకం రావాల్సిందే...
- మైదానం లేకపోవడమే పెద్దలోటు



అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ ముఖచిత్రం



ప్రతిభ కనబర్చి సాధించిన ట్రోఫీతో హేమలత

జిల్లా జట్టులో కీలక భూమిక

విశాఖ జిల్లా ఖోఖో సబ్ జూనియర్ జట్టు అండర్ 14 విభాగంలో విజయం సాధించడంలో పాఠశాల విద్యార్థులు బి.హేమలత, డిల్లేశ్వరి, వి.కీర్తన, ఎస్.శరణ్య కీలక భూమిక పోషించారు. రాష్ట్ర స్థాయి పోటీలో కూడా మొదటిస్థానంలో నిలిచారు. పాఠశాల పీడీ మహ్మద్ ఇస్మాయిల్ నేతృత్వంలో విద్యార్థులు ఖోఖోతో పాటు క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లో రాణిస్తుండడం విశేషం.



ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపి సాధించిన పతకాలతో విద్యార్థినులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు పరిధిలోని అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ఖోఖో ఆటకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించి పాఠశాలకు మంచి గుర్తింపు తెస్తున్నారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో అండర్ 14, 17, అండర్ 18 సీనియర్ విభాగాల్లో సత్తా చాటి ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచారు. నియోజకవర్గం , జోన్ల విభాగాల్లో సైతం ప్రతిభ చూపారు.

సాధించిన విజయాలు

అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి అత్యధికంగా విద్యార్థినులు ఎంపికై చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు, అనకాపల్లి, శ్రీకాకుళం జట్లపై అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జట్టు విజయానికి పునాదులు వేశారు.

గుడిమాన్యం ఉన్నా..

మైదానం లేకపోవడంతో హైస్కూల్‌కు ఎదురుగా ఉన్న గుడి మాన్యంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. అయితే మైదానంలో ఆవులు సేదతీరి మలమూత్రాలతో అస్తవ్యస్తంగా మార్చేస్తున్నాయి. గ్రామానికి చెందిన పలువురు ఆటోలు, ఇతర వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు. ఇక వర్షాలు పడినప్పుడు ఆ స్థలం పూర్తిగా బురదమయం కావడంతో క్రీడల్లో శిక్షణ ఇవ్వడానికి ఆటంకం ఏర్పడుతోంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఖాళీ ఉన్న మైదానాన్ని శుభ్రం చేసే విద్యార్థులు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మైదానం లేకపోవడం వెలితి

క్రీడల్లో విద్యార్థులు రాణిస్తున్నా.. స్కూల్‌కు మైదానం లేకపోవడంతో విద్యార్థులు నిరాశకు లోనవుతున్నారు. పాఠశాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలోనే సాధన చేస్తున్నారు. అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ పీడీ ఇస్మాయిల్ విద్యార్థుల ఆసక్తిని బట్టి ఆయా క్రీడల్లో శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఆ మైదానంలో కూడా వాహనాలు నిలపడంతో అవస్థలు పడుతున్నారు.



వాహనాల పార్కింగ్‌తో అస్తవ్యస్తంగా ఉన్న మైదానం

చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సాహం



విద్యార్థులకు చదువుతో పాటు వారికి ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ ఇచ్చి వారి భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నాం. పాఠశాలకు క్రీడా మైదానం లేకపోవడం దురదృష్టకరం. స్కూల్‌లో జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులు ఉన్నారు. వారికి శిక్షణకు సరైన సదుపాయాలు లేవు. పాఠశాలకు మైదానం కేటాయిస్తే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసినట్లే.

– ఎం.ఎల్.ఎస్.కాంతం,
హెచ్‌ఎం, అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హై స్కూల్

జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు



పాఠశాలకు చెందిన విద్యార్థులు ఖోఖోలో జాతీయస్థాయిలో రాణించారు. వారికి సరైన శిక్షణ ఇస్తే మరింత మెరికల్లా తయారవుతారు. మైదానం లేకపోవడంతో వారికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వలేని పరిస్థితి ఉంది. గ్రామానికి చెందిన మైదానం ఉంది. దాన్ని విద్యార్థులు వినియోగించేలా అవకాశం కల్పిస్తే మరింత మంది క్రీడాకారులను తీర్చిదిద్దడానికి అవకాశం ఉంటుంది.

– ఇస్మాయిల్, పీడీ,
అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హై స్కూల్

స్టీల్ ఉత్పత్తి పెంపునకు కృషి చేయండి



స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ కమిటీ చైర్మన్ విజయకుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్ ఉత్పత్తి, ఉత్పాదకత పెంచడానికి ఉద్యోగులంతా యాజమాన్యానికి సహకరించాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ గ్రీవెన్స్ మరియు రిడ్రసల్ కమిటీ చైర్మన్ విజయకుమార్ పిలుపు నిచ్చారు. గ్రీవెన్స్, రిడ్రసల్ కమిటీ చైర్మన్‌గా విజయకుమార్ నియమితులైన సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు బుధవారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉత్పత్తి పెంచడం ద్వారా ప్లాంట్‌ను లాభాల బాటలో నడపడం యాజమాన్యం ముఖ్య లక్ష్యమన్నారు. ఇందుకు ఉద్యోగులు తమ వంతు కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తొడన్న, బయ్యే మల్లయ్య, నాయకులు ఎస్. సత్యనారాయణ, మోహన్‌బాబు, కె.వి. రత్నం, జె.వి. రామన్న, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అగనంపూడి: రోడ్డు ప్రమాదంలో చేపల వ్యాపారి దుర్మరణం చెందాడు. దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధి అగనంపూడి టోల్‌గేటుకు సమీపంలో జరిగిన ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చీడికాడ గ్రామం ఐటీఐ కాలనీకి చెందిన జనానాగభూషణం (52) చేపల వ్యాపారం చేస్తుంటాడు. గాజువాకలో బంధువుల ఇంట శుభకార్యం ఉండడంతో నాగభూషణం గాజువాక ద్విచక్రవాహనంపై వస్తున్నారు. అగనంపూడి టోల్‌గేటు దాటిన తర్వాత వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొట్టి 30 మీటర్ల దూరం వరకు లాక్కొని వెళ్లిపోయింది. ఈ సంఘటనలో తీవ్రంగా పడిన నాగభూషణం అక్కడికక్కడే మృతి చెందాడు.హెల్మెట్ ధరించి ఉన్నప్పటికీ మృత్యువాత తప్పలేదు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: వుడా కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వుడా కాలనీ ఫీడర్ పరిధిలోని టీఎన్నార్ రోడ్ సిద్దేశ్వరం, వెంపళ్లనగర్, సమతానగర్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రోడ్,టీ జీ ఆర్ నగర్, సిద్దేశ్వరం తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా యువజన దినోత్సవం

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సమితి ఆధ్వర్యంలో బుధవారం యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి 99వ జయంతి వేడుకల్లో భాగంగా ఉదయం ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన చేశారు. తర్వాత హనుమాన్ చాలీసా పారాయణ, రుద్రాభిషేకాలు చేశారు. అగనంపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు పండ్లు, ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం సత్యసాయి యువత ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు యూనిఫారాలు అందజేశారు. సాయంత్రం ఎం. నారాయణ రావు సత్యసాయి సందేశం వినిపించారు. యువ గాయనీ గాయకులచే నిర్వహించిన స్వర పుష్పాంజలి అలరించింది. కార్యక్రమంలో సత్యసాయి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ కమిషనర్‌ను కలిసిన బీఎంఎస్ నాయకులు



ఈపీఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎంఎస్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ)లో పని చేస్తున్న కొంత మంది సీనియర్ కార్మికుల డేట్ ఆఫ్ జాయినింగ్‌ను తప్పుగా నమోదు చేసిన విషయాన్ని బీఎంఎస్ నాయకులు ఈపీఎఫ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు బుధవారం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. సర్వీసులో ఉన్న కొందరు సీనియర్ కార్మికులతో పాటు, పదవీ విరమణ చేసిన కార్మికుల వివరాలు తప్పుగా నమోదు అయ్యాయని వివరించారు. కార్యక్రమంలో బీఎంఎస్ ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు జగదీశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి లావా రెడ్డి, రాష్ట్ర ఈపీఎఫ్‌వో సభ్యుడు ముత్యాలు పాల్గొన్నారు.

అందరి సహకారంతో స్వచ్ఛ విశాఖ



అగనంపూడి వాకింగ్ ట్రాక్‌లో చెత్తా చెదారాన్ని శుభ్రం చేసిన వాకర్స్, స్థానికులు

అగనంపూడి: స్వచ్ఛ విశాఖను తీర్చిదిద్దడంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, స్టీల్ ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు కోరారు. అగనంపూడి వాకింగ్ ట్రాక్‌లో బుధవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. వాకింగ్ క్లబ్ అధ్యక్షుడు మడగల నరసింగరావు, కార్యదర్శి రామారావు మాట్లాడుతూ ట్రాక్ చుట్టూ వీధి దీపాలు , ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయాలనికోరారు. కార్యక్రమంలో కర్రి దశేంద్ర, గళ్లరాజు, పెదిరెడ్ల హరనాథ్, డి.సుబ్బరాజు, డొక్కా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'గొర్రెల కాపరులను ఆదుకోవాలి'

అగనంపూడి: విజయనగరం జిల్లా లక్ష్మీపురం, ఆనందపురానికి చెందిన గొర్రెల కాపరులకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ యాదవ హక్కుల పరిరక్షణ వేదిక అధ్యక్షుడు యలమంచిలి అప్పారావు, విశాఖ జిల్లా బీసీ ఉద్యోగుల సమితి అధ్యక్షుడు బొడ్డు పైడిరాజు కోరారు. కుక్కలు బెదిరించడంతో ట్రాక్‌పైకి వచ్చిన మందను ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఢీ కొట్టడంతో 80 గొర్రెలు మరణించాయన్నారు. బాధితులను ఆదుకోవాలని కోరారు.

'ఉక్కు'పై ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకుడు రమణ

అగంపూడి: విశాఖ పర్యటనకు ఈ నెల 29న వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ప్రకటన చేయాలని విశాఖ ఉక్కు ఐఎన్టీయూసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కారు రమణ డిమాండ్‌చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో చేపట్టిన రిలేదీక్షలు బుధవారం నాటికి 1378వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్మికులు దీర్ఘకాలంగా ఉద్యమాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం కనీసం పట్టనట్టు వ్యవహరించడం సరికాదన్నారు. పెట్టుబడిదారునికి మేలు చేయడం కోసం వేలాది మందిని రోడ్డుమీద పడేయడం ఎంతవరకు సమంజసమో కేంద్ర ప్రభుత్వ పెద్దలు పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్తి శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, మంత్రి గోపీ నారాయణ, నాయుడు, డీఎస్‌పీ రెడ్డి, అశోక్, దుర్గారెడ్డి, వి.అప్పలరాజు, తాతాజీనాయుడు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బంగారు ఆభరణాల అప్పగింత



మహిళకు బంగారు వస్తువును అందజేస్తున్న క్రైం ఎస్‌ఐ మహేశ్వరరావు

అక్కిరెడ్డిపాలెం: ఆటోలో బంగారు వస్తువులు ఉన్న బ్యాగు మర్చిపోయి దిగిన మహిళకు పోలీసులు విచారణ చేపట్టి తిరిగి బ్యాగుతో పాటు ఆభరణాలు అప్పగించారు. గాజువాక క్రైం ఎస్‌ఐ మహేశ్వరరావు తెలిపిన వివరాలు.. కోరమాండల్ గేటు వద్ద బుధవారం కె.కుమారి అనే మహిళ బీసీ రోడ్డుకు వెళ్లడానికి ఆటో ఎక్కింది. బీసీ రోడ్డులో దిగిన తర్వాత ఆటోలో తన బ్యాగు మర్చిపోయినట్లు గ్రహించింది. అందులో 6 తులాల బంగారు వస్తువు ఉండడంతో గాజువాక క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్రమత్తమైన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ఆటోను పాతగాజువాక ఆటోస్టాండ్ వద్ద పట్టుకున్నారు. పెదగంట్యాడకు చెందిన పితాని పెంటయ్య నుంచి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. బ్యాగుతో పాటు బంగారు వస్తువును ఆమెకు ఎస్‌ఐ మహేశ్వరరావు అప్పగించారు.

24న గాజువాకలో కార్మిక ప్రదర్శన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గాజువాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 24న గాజువాకలో నిర్వహించనున్న కార్మిక ప్రదర్శన పోస్టర్‌ను ఆ యూనియన్ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. కార్మిక చట్టాల మార్పు, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వంటి విధానాల వల్ల దేశానికి నష్టం వాటిల్లనుందన్నారు. ఈ విధానాలను నిరసిస్తూ తలపెట్టి ప్రదర్శనలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పని చేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గొలగాని అప్పారావు, ఉరుకూటి రాజు, గొల్ల రాము, గణేష్, నక్క నాగరాజు, చిన్నారావు, సత్యవతి, అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ లక్ష్మీబాయి, సీఐ దాలిబాబు



గాజువాకలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో విశ్వనాథ్

పెదగంట్యాడ: వారం రోజులుగా నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ శాఖాధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సీఐ దాలిబాబు, సాహిత్య సుధ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాఘవాచార్యులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారం రోజులుగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

గాజువాక: పుస్తకం చదవడం వల్ల విజ్ఞానం, వినోదం లభిస్తాయని గాజువాక మండల విద్యాశాఖాధికారి విశ్వనాథ్ అన్నారు. గాజువాక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా వివిధ పోటీల విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయాధికారి బి.చంద్రకళను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు తుంపాల శ్రీరామ్మూర్తి, గాజువాక హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.విజయ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు శివాలయంలో పూజలు



గురుస్వాములను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ శివాలయంలో బుధవారం అయ్యప్పస్వామి పూజలు ఘనంగా జరిగాయి. నెల్లిముక్కు నిర్వాసిత కాలనీకి చెందిన అయ్యప్ప గురుస్వాములు పిట్ట గురునాథరెడ్డి, డి.సోమనాథ స్వామి పర్యవేక్షణలో ఆరాధన ఉత్సవం నిర్వహించారు. ఉక్కు కాంట్రాక్టర్ రాంబాబు సహకారంతో స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రునాయక్, ఎల్లేటి శ్రీనివాస్, ధర్మాల కనకరెడ్డి, చీకటి శ్రీనివాస్, సురేంద్ర, కాళిదాస్, రమేష్, ఎస్. శ్రీనివాస్, శేషు, గోపినాయుడు పాల్గొన్నారు.

కష్టపడేవారికి గుర్తింపు

గాజువాక: పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. 70వ వార్డులో నిర్వహించిన పార్టీ క్రియాశీలక సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 25 లోగా బూత్ కమిటీల నియామకం పూర్తి కావాలన్నారు. ప్రతి బూత్‌లో ముగ్గురు మహిళలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు అవకాశం కల్పించాలన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో నాయకులు కానూరు అప్పలనాయుడు, కట్టా పద్మ, డి.పావని, సుబ్బరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అండగా ఉంటాను

అగనంపూడి: ఎమ్మెల్సీగా పనిచేసిన రోజుల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేశానని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు అన్నారు. పెదముషిడివాడ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో లంచ్ విరామంలో ఉపాధ్యాయులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం పాఠశాల నిర్వాహణ సమయం ఉదయం 9 నుంచి 4 వరకు కొనసాగుతున్నాయని, ఇదే పద్ధతి కొనసాగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలు, కెజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దినాయుడు, పరవాడ మండల కమిటీ నాయకులు శ్రీరామూర్తి, కోవెల రవి, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ, మలేరియా జ్వరాలపై అవగాహన

అక్కిరెడ్డిపాలెం: డెంగ్యూ, మలేరియా జ్వరాలపై 69వ వార్డు నాతయ్యపాలెంలో బుధవారం కళాకారులు అవగాహన కల్పించారు. నివాసాల్లో ఎక్కువ రోజులు నీటి నిల్వలేకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగానికి చెక్ పెట్టాలని కళా బృందం సభ్యులు వివరించారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అమర్నాథ్, మలేరియా హెల్త్ ఇన్‌స్పెక్టర్ కె.అప్పలరాజు, సచివాలయ శానిటరీ సిబ్బంది, మలేరియా, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

కోటి శివలింగాల తయారీలో మేము సైతం..

- ప్రవాస భారతీయుని సంకల్పానికి 'బొర్రమాంబ' సమితి సహకారం
- రెండు రోజుల్లో 50 వేల ప్రతిమల తయారీ



తయారు చేసిన శివలింగాలు



శివలింగాల తయారీలో నిమగ్నమైన బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి: ప్రవాస భారతీయ శివభక్తుని సంకల్పాన్ని సాకారం చేసేందుకు అగనంపూడి బొర్రమాంబ పారాయణ సేవా సమితి సభ్యులు మేము సైతం అంటూ సహకారం అందించారు. రెండు రోజుల్లో 50వేల శివలింగాలను తయారు చేసి ప్రశంసలందుకున్నారు.

కాశీ విశ్వేశ్వరుని సన్నిధిలో పూజల కోసం..

అమెరికాలో నివాసముంటున్న ఒక శివభక్తుడు కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కోటి శివలింగాలను తయారు చేయించాలని సంకల్పించారు. ఆ శివలింగాలకు కాశీ విశ్వేశ్వరస్వామి సన్నిధిలో పూజలు చేసిన అనంతరం గంగానదిలో నిమజ్జనం చేయాలని భావించారు. ఈ పుణ్యకార్యాన్ని పూర్తి చేసే బాధ్యతను రాష్ట్రంలోని వివిధ హిందూ సామాజిక సంఘాలకు అప్పగించారు. అందులో భాగంగా శ్రీసింహాశైల సేవా సంఘం అధ్యక్షురాలు హరి లక్ష్మి ఆధ్వర్యంలో, విజయలక్ష్మి పర్యవేక్షణలో ఈ బృహత్తర కార్యక్రమాన్ని విశాఖ జిల్లాలో రెండు రోజుల పాటు నిర్వహించారు.

రాజమండ్రి నుంచి మట్టి తెచ్చి..

అగనంపూడికి చెందిన బొర్రమాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ కల్యాణమండపంలో 50 మంది భక్తుల బృందం రెండు రోజుల పాటు 50వేల ప్రతిమలను రూపొందించింది. ఈ శివలింగాలను తయారు చేయడానికి అవసరమైన బంక మట్టిని రాజమండ్రి నుంచి తీసుకువచ్చారు. వాటికి సుగంధ ద్రవ్యాలను జత చేసి, తయారు చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సందర్భంగా స్థానిక ప్రజా సంఘాల ప్రతినిధులు విజయలక్ష్మిని సత్కరించారు. కార్యక్రమంలో పారాయణ సేవా సమితి ప్రతినిధులు వి.లీలా లక్ష్మి, వి.సుబ్బలక్ష్మి, ఎం.సౌజన్య, టి.లక్ష్మి, ఆర్.విజయలక్ష్మి, జి.ధనలక్ష్మి, బి.విజయకుమారి, బి.తులసి, ఎం.పెద్దిరాజు, ఎం.ప్రవీణ్, సీహెచ్.రామారావు, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోస్టుకార్డు ఉద్యమం



స్టీల్‌ప్లాంట్ ఎల్‌ఎంఎం విభాగం వద్ద పోస్టుకార్డులు ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఉద్యోగులు పెద్ద ఎత్తున నినదించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టుకార్డు ఉద్యమం ప్లాంట్ విభాగాల్లో ఉధృతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం ఎల్‌ఎంఎంఎం, కోక్‌ఓవెన్స్, సీఈడీ విభాగాల ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పోస్టు కార్డులు పెద్ద ఎత్తున పంపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ అనేక ఉద్యమాల ఫలితంగా ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలనే యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లాల్సి ఉందన్నారు. పలు విభాగాల్లో జరిగిన కార్యక్రమాల్లో కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఐటీఐ స్టాఫ్ కార్యవర్గానికి సన్మానం



మాట్లాడుతున్న ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

పెదగంట్యాడ: ఐటీఐల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమం కోసం పాటుపడతామని జోన్ -1 నుంచి రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికైన గాజువాక ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు అన్నారు. జోన్ -1 ప్రాంతీయ సంచాలకుడు ఆర్‌వీ రమణ, ఐటీఐ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బి.కూర్మారావు ఆధ్వర్యంలో ఏపీ గవర్నమెంట్ ఐటీఐ స్టాఫ్ అసోసియేషన్ కొత్త కార్యవర్గాన్ని గాజువాక న్యూ ఐటీఐలో బుధవారం ఘనంగా సత్కరించారు. మూడు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరరావు, జీవీ శ్రీనివాసు, అప్పలకొండ, టీవీ గిరి, వి.రఘురాం, కామేశ్వరరావు, శివకుమార్ పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం, మృతుని కుడి చేతిపై ఉన్న అమ్మ-గీత పచ్చబొట్టు

అగనంపూడి: లంకెలపాలెం ఫ్లై ఓవర్ కింద రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు బుధవారం గుర్తించారు. దువ్వాడ జీఆర్పీ ఎస్‌ఐ లక్ష్మి అందించిన వివరాలు. రైలు ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తికి 30–35 ఏళ్ల వయస్సు ఉంటుంది. చామన చాయ రంగు కలిగిన సదరు వ్యక్తి శరీరంపై పసుపు రంగు ఫుల్ హ్యాండ్స్ షర్టు, నలుపు రంగు జీన్స్, గ్రే కలర్ ఫుల్ హ్యాండ్స్ స్వెట్టర్ ధరించి ఉన్నాడు. మృతుని కుడిచేతిపైన అమ్మ-గీత అని తెలుగులో పచ్చబొట్టు ఉందని రైల్వే పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని దువ్వాడ జీఆర్పీ ఎస్‌ఐ కె.టి.ఆర్.లక్ష్మి వెల్లడించారు. మృతుని వివరాలు తెలిసిన వా రు 7382058996 నంబరును సంప్రదించాల్సిందిగా కోరారు.